

# భవానీద్వీపం

## –వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 57 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

చిర చిర చిరమనే ధ్వనులు చేస్తూ చూస్తూండగానే క్షణాలలో దగ్ధమైపోయాయి మూడు శరీరాలు. మౌనంగా చూస్తూన్న మహారాజప్రసాదం మరణ సంతాపాన్ని తెలుపుతున్నట్లు ఉన్నది. వద్దు వద్దన్నట్లు కొమ్మల రెమ్మల చేతులూపుతున్నట్లు ఉదయపు గాలులకు చలిస్తున్నాయి ఉద్యానవనంలోని మహావృక్షాలు. భోజచక్రవర్తి ఆస్థానంలోని పండితులు ఒకరినొకరు కౌగలించుకుని విలపిస్తున్నారు.ఆ నవరత్నాలలో ఒక రత్నం అగ్నిలో కాలి బూడిదైంది.

అమాత్యులు, సైన్యాధికారులు, సైనికులు, అంతఃపుర భటులు అందరూ ప్రాణాలు లేని శరీరాలలా కళ తప్పి కట్టెలలా నిలబడిపోయారు. పౌరులు, పురప్రముఖులు, జానపదులు వందల సంఖ్యలో నిశ్చేష్టులై నిలబడి యింకా

అలానే చూస్తుండిపోయారు . స్త్రీలు సన్నగా రోదిస్తూ  వెక్కిళ్ళు  పడుతున్న  ధ్వనులు శరీరాలు గగురుపొడిచేలా వినిపిస్తున్నాయి.

మహాకవి కాళిదాసు శవపేటికకు వెనుకగా ఇనుప గొలుసులతో బంధించి లాక్కునివచ్చిన స్త్రీ నేలపై కుప్పలా కూలిపోయి ఉన్నది. ఒక్కసారిగా వేల కన్నులు ఆ స్త్రీపై పడ్డాయి. తెల్లగా పాలిపోయిన ముఖంతో, ఎండిపోయిన పెదాలు వణుకుతుండగా రెండు చేతులూ జోడించి విచ్చుకత్తులు పట్టుకున్న భటులను ప్రాధేయ పడడం మొదలుపెట్టింది. 'నరకండి! నరకండి పాతకిని! ముక్కలు ముక్కలు చేసి కాకులకూ గద్దలకూ వేయండి' అనే కేకలు మిన్నుముట్టాయి పౌరులనుండి. కొందరు మంత్రులు, సైనికులు కూడా తమ గొంతులను కలిపారు.

అందుకోసమే ఎదురుచూస్తున్నట్లు అంతవరకూ పక్కనే కాచుకుని కూర్చున్నారు ఇద్దరు తలారులు.

ఆకలిగొన్న పులులలాగా ముందుకు కదిలారు. పిరుదులు దాటి మోకాళ్ళ వెనుక వరకూ వ్రేలాడుతున్న కురులను పట్టుకుని మెడను వంచాడు ఒకడు. రెండుచేతులతో బిగించి పట్టుకుని పొడవాటి ఖడ్గాన్ని పైకి లేపాడు మరొక తలారి. 'ఆగండి' అన్న కంఠం గంభీరంగా వినిపించింది. 'ఈ రాజప్రాసాదం, ఈ ఉద్యానవనం సంగీత సాహిత్య సరస్వతీ నూపుర ధ్వనులతో పవిత్రమైనాయి యింతవరకూ. ఈ నీచురాలి రక్తంతో అపవిత్రం కాకూడదు' అంటూ ముందుకు అడుగులేశాడు సన్యాసిలా కనిపిస్తున్న వృద్ధమూర్తి. దివ్యమైన తేజస్సుతో వెలిగిపోతున్న ఆ ఆజానుబాహుడు ముంజుడు. ఆయన భోజచక్రవర్తికి స్వయానా పినతండ్రి. భోజచక్రవర్తి తండ్రి మహారాజు సింధులుడి తమ్ముడు. 'ఈ దుష్టురాలిని నేరస్తుల వధ్యస్థలానికి తీసుకువెళ్ళి, స్వర్గస్తుడైన భోజచక్రవర్తి ఆజ్ఞను నెరవేర్చండి!' అని ఆజ్ఞాపించాడు.

ఆ మాటలు వినబడడంతోనే అరుపులూ కేకలతో పరస్పరం తోసుకుంటూ నగరం వెలుపల ఉన్న వధ్యస్థలానికి పరుగులు తీశారు వందలాదిమంది. ఆ స్త్రీని బలవంతంగా లాక్కుంటూ వెళ్ళిపోయారు భటులు. ముంజుడికి వినయంగా నమస్కరించి, ఆ స్త్రీ వెంట, భటుల వెనుక వెళ్ళిపోయారు యిద్దరు తలారులు.

ఆ తలారులకూ, ముంజుడికీ 'తలను నరకండి' అనే ఆజ్ఞను స్వీకరించడం, యివ్వడము అదే మొదటిసారి

కాదు! దాదాపు యాభై సంవత్సరాలక్రితం ధారానగర చక్రవర్తి ముంజుడు అర్ధరాత్రివేళ ఈ తలారులకే యిదే ఆజ్ఞను యిచ్చాడు. అప్పుడు తెగిపడాల్సిన తల వేరు!

పాఠకుడా! కాళిదాసమహాకవి కన్నీటి గాథలోనుండి తేరుకున్నావా? అంతా కల్పన అని మిన్నకున్నావా?

వేలసంవత్సరాలుగా నా కడుపులో దాచుకున్న రహస్యాలివి, వింటున్నావా? అమాయకుడా! ఈ విశ్వమే

ఒక కల్పన, ఒక కల, కాలసాగరంలోని ఒక అల! జాలిచూపుల జీవుల చాపలను నిర్దయగా బంధించే వల!నేను ఆ అనంత కాలాన్ని! ఆ మహేంద్రజాలాన్ని! ఉన్నది ఉన్నట్టుగా, కన్నది కన్నట్టుగా నీకు చెబుతున్నా! విన్నది విన్నట్టుగా విశ్వసించావా నువ్వు ధన్యుడివి!

ధారానగర సార్వభౌముడు సింధులుడికి ఒక్కగానొక్క కుమారుడు భోజుడు. ప్రాణాంతకమైన విషజ్వరంతో మరణశయ్యపై ఉన్నాడు సింధులుడు. అపర ధన్వంతరులైన రాచవైద్యులకు, భూతవైద్యులకు, మహా మహా మంత్రగాళ్ళకు కొరుకుడుపడని ఆ భయంకర వ్యాధికి లొంగి రాలిపోయేముందు తన కుమారుడిని, ధారానగరాన్ని తన తమ్ముడు ముంజుడి చేతిలో ఉంచి మహారాజు మరణించాడు. మహారాణి సహగమనం చేసింది. బాలుడైన భోజుడికి సంరక్షకుడిగా, మహారాజుగా పరిపాలన చేపట్టాడు ముంజుడు. నేడో రేపో యువరాజుగా భోజుడికి పట్టాభిషేకానికి రాచగురువులు, విశ్వాసపాత్రులైన మంత్రులు మహారాజు ముంజుడిని త్వరపెడుతున్నారు. ఆ సమయంలో కాంచీపురంనుండి ఒక మహావిద్వాంసుడు, దేవీ ఉపాసకుడు దేశాటన చేస్తూ మహారాజు ముంజుడి కొలువుకు చేరుకున్నాడు.

అపర అగస్త్యుడిలా వెలిగిపోతున్న ఆ కాంచీపురపండితుడు మహారాజును ఆశీర్వదించి, ఆయనతో ఘనంగా సత్కారాన్ని అందుకున్నాడు. మహారాజు ప్రక్కన బాలసుబ్రహ్మణ్యుడిలా వెలిగిపోతున్న బాలుడు భోజుడిని తదేకంగా చూశాడు. ఈ బాలుడు దైవాంశ సంభూతుడు, మనువులా, మాంధాతలా, రఘుమహారాజులా మహాచక్రవర్తి అవుతాడు. యుగాలపర్యంతం కీర్తింపబడుతాడు. కవి, పండిత, గాయక కల్పతరువు అవుతాడు. అపర చతుర్ముఖ బ్రహ్మ ఈ బాలకుడు అని బాలుడిని పొగిడాడు. ఆశీర్వదించాడు. ఆ పొగడ్తలు, భవిష్యవాణి ముంజుడి గుండెలో అసూయాజ్వాలలను రగిల్చాయి. సింహాసనాన్ని వీడి, తనూ తన సంతానము ఈ అర్భకుడి అడుగులకు మడుగులు వత్తాల్సిందేనా అని మండిపోయాడు. అర్ధరాత్రి ఈ ఇద్దరు తలారులను పిలిపించాడు. మూడవకంటికి తెలియకుండా బాలుడి తలనరకండి అని నిర్దయగా ఆజ్ఞాపించాడు.

సగం నిదురలో ఉన్న బాలకుడిని అరణ్యమధ్యంలోకి తీసుకెళ్ళారు తలారులు. బాలకుడి ముద్దులముఖాన్ని చూసి జాలితో కన్నీళ్లు పెట్టుకున్నారు తలారులు. మహారాజును మనసులోనే నిందించారు. రాజాజ్ఞను ధిక్కరిస్తే తమనూ వధిస్తాడని భయంతో బాలుడి తల నరకడానికి సిద్ధమయ్యారు. విషయాన్ని గ్రహించాడు భోజుడు. తనమీది జాలితో కన్నీటి పర్యంతమౌతున్న తలారులను గమనించాడు. వారిని తమ విధిని నిర్వర్తించాల్సిందిగా ఆజ్ఞాపించాడు. ఒక చిన్న కోరికను మాత్రం తీర్చాల్సిందిగా అడిగాడు. ఏమిటా కోరిక అని అడిగారు తలారులు. తన పినతండ్రి, మహారాజు ముంజుడికి ఒక సందేశాన్ని పంపడానికి అనుమతిని అడిగాడు. పినతండ్రికి తన సందేశాన్ని చేరవేసిన తర్వాత తనను వధించాలని కోరాడు. సరేనన్నారు తలారులు.

తన మణికట్టును కోసుకుని మర్రి ఆకులో రక్తాన్ని నింపాడు భోజుడు. తన అంగవస్త్రం మీద రక్తంతో ఒక సందేశాన్ని శ్లోక రూపంలో వ్రాసి పంపాడు.

మాంధాతాచ మహీపతిః కృతయుగాలంకారభూతో గతః
సేతుర్యేన మహోదధౌ విరచితః క్వాసౌ దశాస్యాంతకః
అన్యేచాపి యుధిష్ఠిర ప్రభ్రుతయో యాతౌ దివం భూపతే
నైకేనాపి సమంగతా వసుమతీ నూనం త్వయాయాస్యతి

కృతయుగానికే అలంకారభూతుడైన మాంధాత వెళ్ళిపోయాడు. శతయోజనవిస్తీర్ణమైన సముద్రానికి వారధి కట్టి, పదితలల రావణుడిని అంతం చేసిన శ్రీరామచంద్రుడు నేడు ఎక్కడున్నాడు? మిగిలిన మహాచక్రవర్తులు ధర్మరాజు ప్రభ్రుతులు కూడా దివికేగారు. కానీ ఏ ఒక్కరూ భూమిని, రాజ్యాన్ని, సంపదను వెంట తీసుకెళ్ళలేదు! చిన్నాన్నా! రేపో మాపో నీవూ వెళ్ళాల్సినవాడివే. అందరూ వెళ్ళిపోయేవాళ్ళే ఈ లోకంనుండి. పోయేప్పుడు నీవూ ఏమీ తీసుకెళ్ళవు. ఎవరూ ఏమీ తీసుకెళ్ళరు! అదీ ఆ సందేశం!

ఒక తలారి ఆ సందేశాన్ని పట్టుకుని మహారాజు ముంజుడికి అందించడానికి రాచానగరుకు బయలుదేరాడు.

తెల్లవారుఝామున తలారి సందేశాన్ని అంతఃపుర భటులు ముంజుడికి అందించారు. భోజుడి శ్లోకాన్ని చదువుకున్న ముంజుడి హృదయం ద్రవించింది. పశ్చాత్తాపంతో కన్నీరు కార్చాడు. బాలుడు యింకా సజీవుడిగానే ఉన్నాడని తెలుసుకున్నాడు. పరుగున అరణ్యానికి వెళ్ళాడు. అన్నకొడుకును అక్కున చేర్చుకున్నాడు. మరునాడు ఉదయమే భోజుడిని యువరాజుగా పట్టాభిషిక్తుడిని చేశాడు. రాజగురువును యువరాజుకు సంరక్షకుడిగా నియమించి, తాను సన్యసించి వనాలకు వెళ్ళిపోయాడు. ఇన్నేళ్ళకు భోజమహారాజు ఆత్మత్యాగం చేస్తున్నాడనే వార్త విని ధారానగరంలో మరలా అడుగు పెట్టాడు ముంజుడు.

కొన్ని లిప్తలలో ఉద్యానవనం బోసిపోయింది. నేరస్తురాలిమీది కసితో, తలారులు ఆమె తలను నరకడాన్ని కళ్ళారా చూడడానికి కొందరు పరుగున వెళ్ళిపోయారు. కొందరు విరక్తితో, శోకంతో తమ తమ గృహాలకు, గ్రామాలకు వెళ్ళిపోయారు. చితాభస్మాన్ని పవిత్ర నదీ నదాలలో చల్లడానికి కలశాలలో సేకరించారు. ఆచితి పేర్చిన వేదికను గంగా జలంతో శుభ్రపరచడానికి పూనుకున్నారు కొందరు భటులు. ఇతర కార్యక్రమాల పర్యవేక్షణకు వెళ్ళిపోయారు మంత్రులు, అధికార ముఖ్యులు.

అందరికీ దూరంగా, రాజప్రసాదశిఖరమంత ఎత్తున పెరిగిన అశోకవృక్షం క్రింద పద్మాసనంలో కూర్చుని, మొదటినుండీ మౌనంగా అంతా వీక్షిస్తున్నాడు ఒక వృద్ధ మూర్తి. కైలాసంనుండి దిగివచ్చిన వృద్ధనందికేశుడిలా ఉన్నాడు. అమ్మసేవలో పండిపోయిన అగస్త్యుడిలా ఉన్నాడు. పాఠకుడా! ఆ మహానుభావుడెవరో తెలుసా?

ఆయనే ఆనాడు బాలుడైన భోజుడిని భావిమహాచక్రవర్తిగా భవిష్యవాణిని వినిపించిన కాంచీపుర పండితుడు.

ఎలా తెలిసిందో, ఎక్కడినుండి ఎలా వచ్చాడో, ఒక అవతార పరిసమాప్తిని కనులారా చూడడానికి వచ్చాడు.

కాదు! రెండు అవతారాలు అంతమవడాన్ని చూడడానికి, కాదు, కాదు, మూడు అవతారాల ముగింపును వీక్షించి ధన్యుడవడానికి ధారానగరానికి మరొకసారి చేరుకున్నాడు.

ఆయనకు కుడివైపు అల్లంత దూరంలో వృద్ధ దంపతులిద్దరు మొదటినుండీ మౌనంగా రోదిస్తూ అంతా చూస్తూ నిలబడిపోయారు. శోకభారంతో రెండుసార్లు సొమ్మసిల్లిపోయింది ఆ ఇల్లాలు. కొలనునీటిలో తన ఉత్తరీయాన్ని తడిపి, భార్య ముఖం మీద ఆ ఉత్తరీయాన్ని పిండి, పెనిమిటి ఆమెను సేద దీరుస్తూ ఉన్నాడు. అప్పటిదాకా నిగ్రహించుకున్న వృద్ధుడు కన్నీరు నిండిన కడవ భళ్ళున పగిలినట్లు నేలకు కూలిపోయి రోదించడం మొదలుబెట్టాడు. ఆయన ధర్మపత్ని పండిన మామిడిపండులా ఉన్నది. రోదించీ రోదించీ ఎర్రగా కమిలిపోయాయి ఆమె కనులు, నాసిక, చెక్కిళ్ళు. తన పెనిమిటిని తాను ఊరడిస్తున్నది యిప్పుడు. పవిట చెంగుతో భర్త కనులను ముఖాన్ని అద్దుతూ ఆ వృద్ధుడి శోకాన్ని ఉపశమింపజేయడానికి విఫల యత్నం చేస్తున్నది.

'కన్నకొడుకు కళ్ళెదురుగా కాలి బూడిదైపోతుంటే కనీసం కొడుకా అని అని ఎలుగెత్తి ఏడ్చే వీలులేని దౌర్భాగ్యుడిని..' అంటూ కుమిలిపోతున్నాడు ఆ వృద్ధుడు. ఆ మాటలను ఎవరైనా వింటారేమో అని ఆందోళనగా చుట్టూ పరికించి చూస్తూ ఆయనను లేవదీయడానికి ప్రయత్నిస్తూ ఓదార్చే ప్రయత్నం చేస్తున్నది ఆ ఇల్లాలు. వారికి వెనుకగా ఉండి వారినే గమనిస్తున్నారు ముగ్గురు. ఒక వృద్ధుడు, ఆయన కుమార్తె కావచ్చు బహుశా, మెరుగుపట్టని మేలిమిబంగారంలా ఉన్నది. పవిట చెంగును అడ్డుపెట్టుకుని సన్నగా రోదిస్తున్నది. మధ్య మధ్య కనులు తుడుచుకుంటూ ఆ వృద్ధ దంపతులను నిశితంగా గమనిస్తున్నది.

వారి మాటలను వింటూ తనూ కుమిలిపోతున్నది. ఆమె భుజం మీద చేయి వేసి అనునయంగా తడుతూ చల్లబరిచే ప్రయత్నం చేస్తున్నాడు కుబుసం విడిచిన త్రాచులా మెరిసిపోతున్న నవయువకుడు. పదహారేళ్ళ ప్రాయం ఉండవచ్చు ఆ పడుచు ఫల్గుణుడికి.

ఆ స్త్రీ పిక్కలదాకా గోచీతో బిగించి కట్టిన చీరతో, దండచేతులకు వెండి వంకీలతో, కాళ్ళకు బరువైన కడియాలతో, నడుముకు వెండి రేకులాంటి వడ్డాణంతో ఉన్నది. దంతంతో చేసిన గాజులు మోచేతులదాకా ఉన్నాయి. భుజాలదాకా వ్రేలాడుతున్న వెండి ఆభరణాలున్నాయి చెవులకు. అరచేయంత ఉన్న సన్నని ముక్కుపోగు ఆమె కన్నీళ్ళలాగే మధ్య మధ్య మెరుస్తున్నది. వృద్ధుడు, యువకుడు చేతులలో పదునైన ఈటెలు ధరించి ఉన్నారు. తలలకు దంతపు పూసలు కుట్టిన పాగాలు చుట్టుకున్నారు. ఆ పాగాలలో నెమలి ఈకలు అందంగా మెరిసిపోతున్నాయి. ఇంద్రధనుస్సులా మెరిసిపోతున్న తలపాగాతో ఇంద్రసూనుడిలా ఉన్నాడా యువకుడు. వారి రూపురేఖలు, వస్త్రధారణ వారు ఆటవికులో, గిరిజనులో అయి ఉండవచ్చు అని తెలుపుతున్నాయి.

ఆ ముగ్గురినీ, ఈ వృద్ధ దంపతులను మార్చి మార్చి పరిశీలనగా చూస్తున్నాడు కాంచీపుర వృద్ధుడు. ఆయన ముఖంలో చిరునవ్వు మెరిసింది. ఆ స్త్రీని, బహుశా తన తల్లిని, ఊరడిస్తున్న గిరిజన యువకుడు ఎందుకో తలెత్తి కంచిస్వామిని చూశాడు. అందుకోసమే ఎదురుచూస్తున్నట్లుగా, తన వద్దకు రమ్మని అతడికి సంజ్ఞ చేశాడు కంచిస్వామి. ప్రశ్నార్థకంగా చూసి ముందుకు అడుగేసిన యువకుడికి వృద్ధుడినీ, ఆ స్త్రీని కూడా తనవద్దకు తీసుకురమ్మన్నట్టు సంజ్ఞ చేశాడు. యువకుడు ఆ విషయం చెప్పినట్లున్నాడు, ఆ స్త్రీ, ఆ గిరిజన వృద్ధుడు యువకుడితో కలిసి కంచిస్వామివద్దకు అడుగులేశారు.

తరువాత వృద్ధ దంపతులను చూస్తూ 'మహానుభావా! గౌరీశంకరా!' అని పిలిచాడు. ధర్మపత్ని చేయూతతో నెమ్మదిగా లేచి వేల్లోపోవడానికి అడుగులేస్తున్న వృద్ధుడు వెనుకకు తిరిగిచూశాడు. 'ఇలా రండి మహానుభావా!' అన్నాడు కంచి స్వామి ఆ వృద్ధుడిని చూస్తూ. అయోమయంగా చూస్తూ కంచిస్వామి వద్దకు అడుగులేశాడు గౌరీశంకర నామధేయుడైన ఆ వృద్ధుడు. ఆయన ధర్మపత్ని ఆయనను అనుసరించింది.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS